మనం ఎవరికి నచ్చిన,నచ్చక
పోయినా మన బ్రతుకు మనమే
బ్రతకాలి,
మన సమస్యలు మనమే
పరిష్కరించుకోవాలి..
BE UR OWN..

netisudiksha.online

# నేటి సుదీక్ష

సమాజానికి సరైన దృక్పథం

SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న నేటి సుదీక్ష దినపత్రికలో,బ్యూరో, మండలలా రిపోర్టర్‌గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహావంతులైన యువతి,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 7288033333



హనుమకొండ సంపుటి 01 సంచిక 98 గురువారం ,సెప్టెంబర్ 03, 2026 , పేజీలు - 4 వెల : 2.00 PRGI NO : TGTEL/26/A3170


## టీజీఎస్ఆర్టీసీలో 1500 కండక్టర్
# పోస్టుల భర్తీ



**హైదరాబాద్ :** తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రవాణా శాఖ, టీజీఎస్ఆర్టీసీ సాధించిన ప్రగతిని ప్రభుత్వం వెల్లడించింది. ప్రజా రవాణాను బలోపేతం చేయడంతో పాటు మహిళలు, ప్రయాణికులు, కార్మికులకు మేలు చేసేలా అనేక సంస్కరణలు చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి గుర్తుచేశారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 347.36 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని, తద్వారా వారు రూ.12,167 కోట్ల ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమయ్యాక ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేటు 67శాతం నుంచి 89శాతానికి పెరిగిందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 600 బస్సులకు మహిళలనే యజమానులుగా కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టీజీఎస్ఆర్టీసీలో భారీగా కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేయగా, అందులో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు.

## రక్షణ ఎక్స్‌పోకు రండి
# అనుమతులు ఇప్పించండి :

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు రావాలని ఆహ్వానం
- ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు 1500 ఎకరాలు సేకరించి ఇస్తామన్న సీఎం



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్?లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పోను ప్రారంభించాలని, కావాల్సిన అనుమతులనూ మంజూరు చేయాలని కోరారు. దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి ఇస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ జరుగుతోందన్న సీఎం, మరో 750 ఎకరాలు సేకరించి ఇస్తామని కేంద్రమంత్రికి చెప్పారు.రక్షణ ఎక్స్‌పోకు రండి : భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్? కేంద్రమంత్రికి తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పోను ప్రారంభించాలని కోరారు. దిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సు నిర్వహిస్తామన్నారు. ఎయిర్‌షో, పారిశ్రామిక, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు ఎక్స్‌పోలో పాల్గొంటారని, ఇలాంటి సదస్సుకు రక్షణమంత్రి హాజరై వారికి మార్గనిర్దేశం చేస్తే ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు.

# రాజీనామా కోరలేదు
## అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నా



**హైదరాబాద్, సెప్టెంబర్ 2:** కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు.బీసీ అయిన తనకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ తెలియజేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

## 22ఎ భూములపై అసెంబ్లీలో
# ఏం మాట్లాడతారో రండి



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 :** 22ఎ భూములపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ నేతలు సభలో ఏం మాట్లాడతారో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ చేశారు. 22ఎ భూములను అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు.(బుధవారం) హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిట్‌చా ట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, పెట్టిన బకాయిలు తాము చెల్లిస్తున్నా మని స్పష్టం చేశారు. యాస, భాషలతో ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బకాయిలను తామే చెల్లించామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లకు పెట్టిన బకాయిలను కూడా తామే చెల్లించామని పేర్కొన్నారు.మా పాలనలోని వెయ్యి రోజుల్లో రూ.1.76లక్షల కోట్లను రైతులకు ఇచ్చాం. ఆనాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అన్నారు.. మేము వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చాం. ప్రజలను కావాలని మా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారు. ఉప ఎన్నికల్లో ఓడినా బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం కాలేదు. లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్నా వచ్చినా గులాబీ పార్టీకి జరాలేదు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓడించాంఅయినా వారిలో మార్పు రాలేదు. ఆనాడు బతుకమ్మ చీరల్లో అవినీతికి పాల్పడ్డారు. రాహుల్ గాంధీని విమర్శస్తావా కేటీఆర్..?. అధికారంలోకి వస్తామని మీరు కలలు కంటూనే ఉండండి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మేము నిర్మిస్తున్నాం.

## ఉత్తరాంధ్రను ముద్దాడిన
# గోదారమ్మ



**అనకాపల్లి జిల్లా :** ఉత్తరాంధ్ర దశాబ్దాల కల సాకారమైంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకాయి. ఈ చారిత్రక ఘట్టానికి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వేదికైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గోదావరి జలాలకు జలహారతి ఇచ్చి, పవిత్ర జలాలను శిరస్సున చల్లుకున్నారు. అనంతరం నేలపై సాష్టాంగ ప్రమాణం ఆచరించి, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరిన క్షణాన తన కృతజ్ఞతను చాటుకున్నారు. ఓ దశలో కాలువ నుంచి నీరు ప్రవహిస్తుంటే, చంద్రబాబు మెడలోని పచ్చ కండువా తీసి గాల్లో గిరగిరా తిప్పి తన ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబును చూసి మిగతా నేతలు, రైతులు కూడా తమ కండువాలను గాల్లో ఊపుతూ హర్షం వెలిబుచ్చారు అంతకుముందు, పాయకరావుపేట వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రెగ్యులేటర్ బటన్ నొక్కి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలోకి గోదావరి నీటిని విడుదల చేశారు. దాంతో కాలువలోకి ప్రవేశించిన గోదావరికి చంద్రబాబు జలహారతి పట్టారు. అనంతరం చంద్రబాబు, మరికొందరు రైతులు కూడా రెగ్యులేటర్ ఆన్ చేశారు.

## మంత్రివర్గంలో మార్పులా? సమూల ప్రక్షాళనా! -
# ఉత్కంఠగా కాంగ్రెస్ రాజకీయం

**హైదరాబాద్ ::** తెలంగాణ మంత్రివర్గంలో జరగనున్న మార్పులపై కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సీనియర్ నాయకులంతా దిల్లీకి వెళుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా అక్కడే ఉన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు నేడు దిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర మంత్రులను కలవడానికని, జలశక్తి మంత్రిత్వశాఖ నిర్వహించే సమావేశానికని, వై.ఎస్.రాజశేఖరరెడ్డి అవార్డు ప్రదానోత్సవానికని ఇలా ఒక్కొక్కరు ఒక్కో కారణం చెబుతున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా వారందరి దిల్లీ పర్యటన తీవ్ర ఆసక్తికరంగా మారింది. విదేశీ పర్యటనకు వెళ్లిన కాంగ్రెస్ జనరల్? సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మంగళవారం తెల్లవారుజామున దిల్లీ చేరుకున్నారు.సీఎం రేవంత్‌రెడ్డి నిన్న సాయంత్రమే కేసీతో సమావేశమై ఇటీవల పరిణామాల గురించి సుదీర్ఘంగా చర్చలు చేశారు. సురేఖ వ్యవహారంతోపాటు ఒకరిద్దరు మంత్రుల వ్యవహారశైలి గురించి, మంత్రివర్గంలోకి తీసుకోవాల్సిన వారి గురించి మాట్లాడినట్లు సమాచారం. భట్టి, మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో కూడా కేసీ చర్చించే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశం నేడు జరగవచ్చని తెలుస్తోంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనల వంటివి పునరావృతం కాకుండా



ఉండేందుకు లైన్? దాటిన వారిపై చర్యలు అవసరమనే అభిప్రాయంతో మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై చర్య అనివార్యమనే అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి పెద్ద ఎత్తున వ్యక్తమవుతోంది.

## సీఈవోగా విశ్రాంత ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకం

**అయోధ్య:** అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియమితులయ్యారు. సీఈఓ ఎంపిక కోసం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ నేతృత్వంలో ఏర్పాటైన ముగ్గురు సభ్యుల కమిటీ జితేంద్ర మిశ్రాను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో సమావేశమైన రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జితేంద్ర మిశ్రా నియామకానికి ఆమోదం తెలిపింది. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించడం, రోజువారీ ఆలయ నిర్వహణ సిబ్బందిని సమన్వయం చేయడం వంటి విధులను ఆయన నిర్వర్తించనున్నారు. జితేంద్ర మిశ్రా గతంలో భారతీయ వాయుసేనలో సీనియర్ అధికారిగా, ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్–ఇన్–చీఫ్‌గా విశేష సేవలందించారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం
# సాధించిన ప్రగతి ఇదే



**హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వెయ్యి రోజుల కాలం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు, నెరవేర్చని హామీలతోనే సాగిందని ఆమె ధ్వజమెత్తారు.గడిచిన వెయ్యి రోజుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల బతుకులను బాగు చేసింది ఏమీ లేదని, కేవలం కొందరి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిందని మండిపడ్డారు. హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం, సంక్షేమ గురుకులాల్లో భద్రత లేక విద్యార్థులు వరుసగా మరణించడం, జాబ్ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం, పంటలకు మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు పెరిగిపోవడం.. వీటికి తోడు రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించి నేరాలు నిత్యకృత్యం కావడమే ఈ ప్రభుత్వం సాధించిన అసలైన 'ప్రగతి' అని ఎద్దేవా చేశారు. ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఈ సర్కార్ కాలం చెల్లిపోయిందని హెచ్చరించారు. ప్రభుత్వ అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని, ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

# హనుమకొండలో బీఆర్ఎస్ నిరసన.. వినయ్ భాస్కర్ అరెస్ట్





**హనుమకొండ, సెప్టెంబర్ 2:** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. ముందస్తు అనుమతి తీసుకున్నప్పటికీ పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. ఆదాలత్ సర్కిల్ వద్ద వినయ్ భాస్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ, బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనను కొనసాగించారు. అనంతరం సుబేదారి జంక్షన్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్‌ను సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించగా, మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ స్టేషన్‌కు చేరుకుని ఆయనకు సంఘీభావం తెలిపారు. వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. "ప్రజ ల పక్షాన నిరసన తెలుపుతున్న మమ్మల్ని అక్రమ అరెస్టులతో అడ్డుకోలేరు. వెయ్యి రోజు ల కాంగ్రెస్ పాలనలో జరిగిన వైఫల్యాలపై ఛార్జ్‌షీట్‌ను ప్రజల ముందు ఉంచుతున్నాం" అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాలో తెలంగాణ అభివృద్ధిలో ముందంజలో ఉంటే, ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లిందని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్తామని వినయ్ భాస్కర్ తెలిపారు.

# రోడ్డు భద్రత సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన

**- సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం**



**వరంగల్, సెప్టెంబర్ 2 (సుదీక్ష న్యూస్):** రోడ్డు భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ బుధవారం సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి పరిశీలించారు. వరంగల్ కొత్త బస్టాండ్ నిర్మాణ పనులతో పాటు రహదారులపై ఏర్పడుతున్న నీటి నిల్వలు, గుంతలు, రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలు మరియు వాహనదారులు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లక్ష్మీపురం మార్కెట్ పరిధిలోని రహదారుల పరిస్థితిని కూడా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడా నీటి నిల్వలు ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్.. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని అధికారులకు తెలి పారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఏపీ సర్వే ల్యాండ్ అధికారి శ్రీనివా సులు, ఆర్డీవో వరంగల్ సుమ, ఆర్అండ్‌బీ ఈఈ రాజేందర్, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు

**- అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత**




**వరంగల్, సెప్టెంబర్ 2 (సుదీక్ష న్యూస్):** వినాయక చవితి సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన సైబర్ భద్రత అవగాహన పోస్టర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ బుధవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. 'వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు' అనే సందేశంతో రూపొందించిన ఈ పోస్టర్‌లో సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్నంగా వివరించారు. వినాయకుడి పెద్ద చెవులు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా వినాలని, చిన్న కళ్లతో నిశితంగా గమనించాలని, పెద్ద తలతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా పోస్టర్ ద్వారా అవగాహన కల్పించారు. అత్యాశ, భయం, తొందరపాటు వంటి భావోద్వేగాలను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుంటారని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీపీ ఎన్. శ్వేత సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, గుర్తుతెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం వంటివి చేవద్దని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం/డెబిట్ కార్డు సమాచారం, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఆన్‌లైన్ ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బహుమతులు, లాటరీల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, ఖాతాల భద్రత కోసం బలమైన పాస్‌వర్డ్‌లు, టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వినియోగించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే డబ్బును తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేం దుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ స్టేషన్ ఏసీపీ వెంకటరమణ, సీఏసీ-2 ఏసీపీ జానీ నర్సింహులు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు చరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలోని ఓటర్లకు ప్రత్యేక విచారణ కేంద్రాలు

**- అక్టోబర్ 18 వరకు విచారణ ప్రక్రియ: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**హనుమకొండ, సెప్టెంబర్ 2 (సుదీక్ష న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు సంబంధించిన నోటీసులు, అభ్యంతరాలపై విచారణ నిర్వహించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. ఈ విచారణ ప్రక్రియ అక్టోబర్ 18 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసిన ఏఈఆర్ఓ విచారణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో మొత్తం 50 ప్రత్యేక విచారణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆర్ట్స్ కళాశాలలో ఐదు, ఆరు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన విచారణలను నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ కింద నోటీసులు అందుకున్న ఓటర్లు తప్పనిసరిగా విచారణకు హాజరై, ఎన్నికల సంఘం సూచించిన సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓలకు అవసరమైన పత్రాలను అందజేయాలని తెలిపారు. విచారణకు హాజరైన ప్రతి ఓటరు సమర్పించిన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు హాజరు రిజిస్టర్‌లో సంతకం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోజువారీగా అందిన దరఖాస్తులు, విచారణలను అదే రోజు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్ఓలు సమన్వయంతో పనిచేస్తూ షెడ్యూల్ ప్రకారం నోటీసులు అందించడం, ఓటర్ల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించడం, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం వంటి ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు కూడా తుది ఓటర్ల జాబితాలో చోటు కోల్పోకుండా అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించేలా ప్రజలు, ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. అర్హులైన ఓటర్లు తమ ధ్రువపత్రాలతో విచారణకు హాజరయ్యేలా సహకరించడం ద్వారా పారదర్శకమైన తుది ఓటర్ల జాబితా రూపొందించేందుకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఈఆర్ఓ, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, హనుమకొండ ఏఈఆర్ఓ, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిల్చిన మహా నేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి

**ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**



**ఢిల్లీ:** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తనదైన ముద్ర వేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సాగు నీటి ప్రాజెక్టులు, ఔటర్ రింగు రోడ్డు వంటి అభివృద్ధి పనులు, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలతో పాలనపై చెరగని ముద్ర వేసిన నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, ఎం.అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

## ఖర్గేను కలిశాను.. ఏం చేస్తారో వేచి చూస్తున్నా: మంత్రి కొండా సురేఖ



**ఢిల్లీ, సెప్టెంబర్ 2 (సుదీక్ష న్యూస్):** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసినట్లు తెలంగాణ మంత్రి కొండా సురేఖ తెలిపారు. అధిష్ఠానం పిలుపు మేరకు ఢిల్లీ వెళ్లిన ఆమె బుధవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఖర్గేతో భేటీలో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలతో పాటు తనకు సంబంధించిన అంశాలను వివరించినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు అధిష్ఠానంలోని ముఖ్య నేతలందరికీ అన్ని విషయాలను రాతపూర్వకంగా తెలియజేశానని చెప్పారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేను కోరినట్లు వెల్లడించారు. "నన్ను రాజీనామా చేయమని ఇప్పటివరకు ఎవరూ చెప్పలేదు. కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదు. అధిష్ఠానం



ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూస్తున్నా" అని కొండా సురేఖ పేర్కొన్నారు. తన సామాజిక వర్గాన్ని ప్రస్తావిస్తూ.. "బీసీనైన నాకు ఒక న్యాయం, ఇతర సామాజిక వర్గాలకు మరో న్యాయం పాటిస్తారా?" అని ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజిక వర్గాలకు చెందిన పలువురు నేతలపై కూడా అనేక ఆరోపణలు పెద్ద ఎత్తున ఉన్నాయని, వాటన్నింటిపై ఏం సమాధానం చెబుతారు? ఎలాంటి చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. తాను ఇప్పటికే అధిష్ఠానం పెద్దలందరికీ అన్ని అంశాలను వివరించానని, ఇప్పుడు పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయం కోసం వేచి చూస్తున్నానని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

## తుక్కుగూడ నర్స్ కేసు.. సుమోటాగా స్వీకరించిన ఎన్‌సీడబ్ల్యూ




**హైదరాబాద్, సెప్టెంబర్02:** ఇటీవలే తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న ఓ యువతిపై అత్యాచారం చేసి.. ఆపై హత్య చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో జాతీయ మహిళా కమిషన్ నర్సు హత్య కేసును సుమోటాగా స్వీకరించింది. ఈ ఘటనపై ఏడు రోజుల్లో పూర్తి నివేదిక సమర్పించాలని తెలంగాణ డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, హత్యకు గల కారణాల గురించి సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలని జాతీయ మహిళా కమిషనర్ లేఖలో పేర్కొన్నారు. నిందితుడిని కస్టడీలోకి తీసుకుని, త్వరితగతిన కేసు దర్యాప్తు పూర్తి చేయాలని ఆమె సూచించారు. నిందితుడి పూర్వ నేరచరిత్రపై ఆరా తీయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ మేరకు నిందితుడిపై తక్షణమే కఠినచర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా కమిషన్ ఆదేశాలు జారీ చేసింది.

నేటి సుదీక్ష
SUDIKSHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

# వనపర్తి బ్రాంచ్ లో ఎల్ఐసి 70వ భీమా వారోత్సవాలు



**పెబ్బేరు,సెప్టెంబర్ 02 :** ఎల్ఐసి 70వ భీమా వారోత్సవాలను పురస్కరించుకుని వనపర్తి ఎల్ఐసి బ్రాంచ్ లో మంగళ, బుధవారాల్లో మెగా ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు.
లియాఫీ యూనియన్ ఆధ్వర్యంలో, యశోద హాస్పిటల్ మలక్ పేట సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని బ్రాంచ్ మేనేజర్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్ఐసి ఏజెంట్లు, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రస్తుత జీవనశైలి కారణంగా వస్తున్న ఆరోగ్య సమస్యల పట్ల ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లియాఫీ అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 400 మందికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో, థైరాయిడ్, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎం కృష్ణ ప్రసాద్, బ్రాంచ్ సిబ్బంది, డెవలప్ మెంట్ ఆఫీసర్లు, లియాఫీ నాయకులు, యశోద ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బదిలీపై వెళ్లిన అధ్యాపకులకు ఘన వీడ్కోలు



**శ్రీకాకుళం జిల్లా, 02 సెప్టెంబర్**
సోంపేట మండలం బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బదిలీపై వెళ్లిన అధ్యాపకులకు వీడ్కోలు సమ్మేళన సభను కళాశాల ప్రాంగణంలో బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రామారావు గారి అధ్యక్షతన, వైస్ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు గారి పర్యవేక్షణలో ఈ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఇటీవల వివిధ కళాశాలలకు బదిలీ అయిన అధ్యాపకులు:శ్రీ పండి రామకృష్ణశ్రీ బడ్డ రాంబాబుశ్రీ కాంచరాన హేమసుందరరావుడాక్టర్ రుప్ప శేషగిరి రావు శ్రీ సాలీన కృష్ణారావు మరియు ఆఫీసు సబార్డినెట్ శ్రీ కే. సంతోష్ కుమార్ ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధిలోను, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలోను బదిలీపై వెళ్తున్న అధ్యాపకులు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం బదిలీ అయిన అధ్యాపకులను దుశ్శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి, వారి భవిష్యత్తు మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీడ్కోలు పలికారు.

# పూజలతో అనారోగ్యం నయం చేస్తామని రూ.62లక్షలు స్వాహా! - నిందితులు అరెస్టు

**సిరిసిల్ల:** అనారోగ్యానికి గురైతే ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంటాం. నయం కాకపోతే ఇంకో ప్రయత్నం చేస్తాం. అయినా సమస్య పరిష్కారం కాకపోతే మరిన్ని మార్గాలు అన్వేషిస్తాం. ఆ మహిళ కూడా అదే పనిచేసింది. ఓ ఇద్దర్ని నమ్మింది. ఏళ్లుగా ఇబ్బంది పబెడుతున్న తన అనారోగ్యాన్ని నయం చేస్తారని భావించింది. వారు కూడా ఆమెకు అదే స్థాయిలో భరోసా ఇచ్చారు. మేముండగా నీకెందుకు చింత అని చెప్పుకొచ్చారు. వారు చెప్పిందల్లా ఆమె చేసింది. ఆరోగ్యం కోసం నానాపాట్లు పడింది. చివరకు మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. అసలు వారెవరు? అనారోగ్యాన్ని నయం చేయడానికి వారు ఎంచుకున్న మార్గం ఏంటి? చివరకు పోలీసులు ఏం తేల్చారుక్షుద్రపూజలతో అనారోగ్యాన్ని నయం చేస్తామని : గతనెల సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌కు ఓ మహిళ ఆందోళనగా వచ్చింది. ఇద్దరు వ్యక్తులు తనకు ఇవ్వాల్సిన సుమారు 62 లక్షల రూపాయలను ఇవ్వడం లేదంటూ ఫిర్యాదు చేసింది. అంత పెద్ద మొత్తంలో డబ్బు ఇచ్చారంటే అప్పుగానో ఆస్తికోసమో అని అంతా అనుకున్నారు. కానీ తనకున్న అనారోగ్యాన్ని నయం చేసేందుకు వారికి డబ్బులు ఇచ్చానని ఆ మహిళ చెప్పింది. రోగాన్ని నయం చేస్తారంటే డబ్బులు తీసుకున్న వ్యక్తులు డాక్టర్లో కార్పొరేట్ ఆసుపత్రి వాళ్లో అనుకుంటే పొరపాటే. డబ్బులు తీసుకున్న వాళ్లు అసలు వైద్యులే కాదు పూజలు చేసి ఆమె ఆరోగ్యాన్ని నయం చేస్తామని నమ్మించిన కేటుగాళ్లు. హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన లత పూజా సామాగ్రి కోసం తూంకుంటలోని భద్రకాళీ పూజా స్టోర్‌కు తరచూ వెళ్లేది. దుకాణ నిర్వాహకుడు శ్యాం కుమార్‌తో ఉన్న పరిచయంతో చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నానని ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కావడం లేదని తన బాధల్ని పంచుకుంది. వైద్యం దాకా ఎందుకు క్షుద్ర పూజలతో అనారోగ్యాన్ని ఇట్టే నయం చేయొచ్చని శ్యాంకుమార్ చెప్పాడు. మంత్రాలతో దీర్ఘకాలిక వ్యాధులు నయం చేసే వ్యక్తి తనకు పరిచయం ఉన్నాడని చెప్పాడు. వేములవాడ అగ్రహారానికి చెందిన లక్ష్మీరాజాన్ని సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద ఆమెకు పరిచయం చేశాడు. అనారోగ్యానిదేముంది నయం చేసేద్దామని లక్ష్మీరాజం లతకు చెప్పాడు. మహిళ నుంచి రూ.62 లక్షలు కాజేసి : తొలుత పూజాసామాగ్రి కోసం శ్యామ్‌కుమార్, లక్ష్మీరాజం 10లక్షల రూపాయలు అడిగారు. వెంటనే లత 10లక్షలు ముట్టజెప్పింది. పూజల పేరుతో ఆమెను వివిధ స్థలాలకు తిప్పారు. యాదగిరి గుట్ట వద్ద 21 లక్షలు, కాశీలో 13 లక్షల రూపాయలు తీసుకున్నారు. మళ్లీ డబ్బుకావాలంటే శ్యామ్‌కుమార్ ఇచ్చిన బ్యాంకు అకౌంట్లకు విడతల వారీగా మొత్తం 62 లక్షలు ఆ మహిళ పంపించింది. తెల్లకాగితాలపైన మహిళ సంతకాలు సైతం తీసుకున్నారు. ఎన్ని పూజలు చేసినా రోగం నయం కాలేదు. తగ్గే సూచనలూ కనిపించలేదు. దీంతో డబ్బులిచ్చేయండని లత వారిని నిలదీసింది. దీంతో అటువైపు నుంచి బెదిరింపులు మొదలయ్యాయి. చేతబడి చేసి ఆమెను, ఆమె కుటుంబాన్ని అంతమొందిస్తామని బెదిరించారు. నమ్మించారు. డబ్బులివ్వాల్సిందేనని లత పట్టుబట్టడంతో ఈ నెల 23న డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పి సిరిసిల్ల బస్టాండ్ వద్దకు రమ్మన్నారు. ఆమె వెళ్లింది. కాని ఇద్దరూ రాలేదు. విసిగి వేసారినలత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# గ్లోబల్ సమ్మిట్- రక్ష ఎక్స్‌పోలో భాగస్వాములు కండి

**- దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూ కేటాయింపు**
**- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు ఆహ్వానం**
**- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**ఢిల్లీ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో–2026ను ప్రారంభించాలని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. రక్షణ ఎక్స్‌పో లో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు రక్షణ శాఖ మంత్రి హాజరై మార్గనిర్దేశం చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో–2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని రాజ్‌నాథ్ సింగ్‌కు వివరించారు.
రక్షణ ఎక్స్‌పో–2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు రక్షణ శాఖ సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వాములు కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూ సేకరణ చేపట్టిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలియజేశారు. రక్షణ శాఖ కోరినట్లు మొత్తం 1500 ఎకరాలు కోరినందున, మరో 750 ఎకరాలు సేకరించే ఇచ్చేందుకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్) ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం.అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు





**పరకాల,సెప్టెంబర్ 2 (సుదీక్ష న్యూస్) :**
తెలంగాణ విముక్తి పోరాటంలో పరకాల అమరవీరుల త్యాగాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. పరకాల అమరధామంలోని అమరవీరులస్తూపం వద్ద ఆయన ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దారుణాలకు వ్యతిరేకంగా ప్రజలు సాగించిన వీరోచిత పోరాటాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరకాలలో జరిగిన మారణకాండ దక్షిణ భారత జలియన్‌వాలాబాగ్‌ను తలపించిందని పేర్కొన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేపట్టిన ఆపరేషన్ పోలో అనంతరం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని గుర్తుచేశారు. సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా ప్రకటించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో అధికారికంగా నిర్వహిస్తున్నప్పుడు తెలంగాణలో ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ విముక్తి పోరాట చరిత్రను విస్మరిస్తున్నాయని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి భావితరాలకు అందిస్తామని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17న ప్రతి పల్లెలో, విద్యాసంస్థలో మువ్వన్నెల జెండాను ఎగురవేసి, వందేమాతరం, జనగణమన గీతాలను ఆలపిస్తూ అమరవీరులకు నివాళులు అర్పించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సేవలు చేస్తున్న సేవకులకు దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి









**తేదీ: 02.09.2026కాశీబుగ్గ, వరంగల్.**
- వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ. వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి పూజ వరంగల్ కాశీబుగ్గలోని మిషనరీస్ ఆఫ్ చారిటీని సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న మానసిక దివ్యాంగులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, వారికి పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ, సమాజంలో ఆదరణ అవసరమైన మానసిక దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అన్నారు. మిషనరీస్ ఆఫ్ చారిటీ ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న సేవలను అభినందించారు. మిషనరీస్ ఆఫ్ చారిటీ ద్వారా మానసిక వైకల్యంతో ఉన్న వ్యక్తులకు ఓర్పు, సహనం, ప్రేమతో నిస్వార్థ సేవలందిస్తున్న సిస్టర్స్‌ను న్యాయమూర్తి ప్రత్యేకంగా అభినందించారు. వారి అంకితభావం, సేవా స్ఫూర్తి ప్రశంసనీయమని అన్నారు. పట్ల ఎంతో ఓర్పు, సహనం మరియు ప్రేమతో సేవలందిస్తున్న సిస్టర్స్‌ను ప్రత్యేకంగా అభినందించారు. వారి నిస్వార్థ సేవా భావం ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. అక్కడి దివ్యాంగులతో కొంత సమయం గడపడం సంతోషంగా ఉందని, వారి అవసరాలను తెలుసుకునే అవకాశం లభించడం ఆనందంగా ఉందని తెలిపారు. “మానసిక దివ్యాంగుల జీవితాల్లో ఆరోగ్యం, ప్రశాంతత ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. సిస్టర్స్ చేస్తున్న సేవలకు దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని” అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.శ్రీనివాస రావు, మిషనరీస్ ఆఫ్ చారిటీ సిస్టర్ ఎల్వీ, సిబ్బంది పాల్గొన్నారు. ఇట్లు జిల్లా న్యాయ సేవాధికర సంస్థ, వరంగల్.

# కృష్ణదేవరాయలుగా కిచ్చా సుదీప్

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఆయన నటిస్తున్న తాజా చారిత్రాత్మక చిత్రం 'దేవరాయ'టైటిల్ పోస్టర్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో సుదీప్ ప్రసిద్ధ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల పాత్రలో కనిపించనున్నారు. 'కన్నడ రాజ్య రామ రమణ.. మూడు రాయరా గండ.. ఆంధ్ర భోజ.. శ్రీకృష్ణదేవరాయ' అనే పవర్‌ఫుల్ బిరుదులతో ఈ సినిమాను అనౌన్స్ చేశారు. ఈ చిత్రంలో సుదీప్ కిచ్చా 'దేవరాయ'గా వెండితెరపై అలరించనున్నారు. ఈ పాన్-ఇండియా మూవీని అత్యంత భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తుండగా, సినిమాను 2027 డిసెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. సుదీప్ పుట్టినరోజు కానుకగా విడుదలైన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు.




# ఓటిటిలోకి పళ్ల బురుసు

సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం పళ్ళబురుసు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఇప్పుడీ సినిమా నెలరోజుల్లోపే సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలంగాణ గ్రామీణ కథగా రూపొందింది. కథేంటంటే..: తెలంగాణలోని ఓ పల్లెటూరిలో ఉండే ఒంటరి వృద్ధుడు శంభు (సుధాకర్ రెడ్డి). పంటినొప్పితో ఆస్పత్రికి వెళ్లగా.. డాక్టర్ చికిత్స చేసి, కొన్ని మందులు రాసిస్తుంది. అలాగే పళ్ళ నొప్పి రాకుండా ఉండేందుకు వేపపుల్లతో కాకుండా టూత్ బ్రష్ వాడాలని చెబుతుంది. దీంతో ఆ పళ్ళ బురుసు (టూత్ బ్రష్) కొనిమ్మని తన కొడుకు తిరుపతి (మురళీధర్ గౌడ్)ని అడుగుతాడు. కానీ, ఆ కొడుకు వ్యక్తిగత సమస్యల్లో పడి తన తండ్రి మాటని నిర్లక్ష్యం చేస్తాడు. అది శంభుకి కోపాన్ని తెప్పిస్తుంది. సరిగ్గా అదే సమయంలో అతని కొడుకు తనని ఆహ్వానించకుండా మనవరాలి పెళ్లి జరిపించడంతో అవమాన భారంతో రగిలిపోతాడు. దీంతో పళ్ళ బురుసు కొనివ్వలేదన్న సాకుతో కొడుకుపై కేసు పెట్టేందుకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతాడు శంభు. ఇక అక్కడి నుంచి ఆ వివాదం జిల్లా కోర్టుకు చేరుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అనేది కథ.




# సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియాన్ మృతి కేసులో బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు



బాలీవుడ్ దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియాన్ మృతి కేసులో బాంబే హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో నమోదైన పిటిషన్లను విచారించిన న్యాయస్థానం, దిశా సాలియాన్ అనుమానాస్పద మృతిపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ విచారణకు ఆదేశిస్తూ నిర్ణయం తీసుకుంది.వివరాల్లోకి వెళితే... జూన్ 2020లో ముంబైలోని మలాడ్ ప్రాంతంలో ఉన్న 14వ అంతస్తు భవనం నుంచి కిందపడి దిశా సాలియాన్ మృతి చెందారు. ఆమెది ఆత్మహత్య అని మొదట్లో పోలీసులు పేర్కొన్నప్పటికీ... ఆ తర్వాత తీవ్ర అనుమానాలు, రాజకీయ ఆరోపణలు వ్యక్తమయ్యాయి.మూడేళ్లకు పైగా కేవలం యాక్సిడెంటల్ డెత్ రిపోర్ట్ ప్రాతిపదికన మాత్రమే దర్యాప్తును కొనసాగించడం, ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపి నిజాన్ని బయటకు తీసేందుకు కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి సమగ్రంగా విచారించాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది.
గతంలో శివసేన (యుబిటి) నేత ఆదిత్య థాకరేపై దిశా తండ్రి సతీశ్ సాలియాన్ ఆరోపణలు చేస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరగా... సరైన ఆధారాలు లేకుండా ఎవరినీ నిందితులుగా పేర్కొనలేమని, అయితే పారదర్శక దర్యాప్తు అత్యవసరమని కోర్టు పేర్కొంది. సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణానికి కొన్ని రోజుల ముందే ఈ ఘటన జరగడంతో, సీబీఐ విచారణ నిర్ణయం బాలీవుడ్ తో పాటు దేశవ్యాప్తంగా మళ్లీ తీవ్ర చర్చనీయాంశమైంది.

# రజనీ అభిమానులకు పండగ

## అక్టోబర్ 15న జైలర్-2 విడుదల




సూర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'జైలర్' సాధించిన ఘన విజయం తర్వాత సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే గత కొద్ది రోజులుగా సినిమా విడుదలపై సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'జైలర్ 2'కు సంబంధించి ఇటీవల చిత్రబృందం నుంచి పెద్దగా ప్రమోషనల్ అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో సినిమా అనుకున్న తేదీకి విడుదల కాకపోవచ్చనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందంటూ అభిమానుల్లో కూడా కొంత గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చి ఈ ప్రచారానికి చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా వాయిదా పడుతుందనే వార్తలకు తెరపడినట్లైంది. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావడంతో రజినీకాంత్ అభిమానుల్లో సందడి మొదలైంది. దసరా సీజన్‌కు దగ్గరగా ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ అంచనా మొదలైంది. ఇప్పటికే 'జైలర్ 2' నుంచి విడుదలైన 'అలా బొలేలో' పాటకు మంచి స్పందన వచ్చింది. రజినీకాంత్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పాటను రూపొందించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది.ఇక రిలీజ్ డేట్‌ను అధికారికంగా మరోసారి ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రమోషన్లను వేగవంతం చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మరిన్ని పాటలు, టీజర్, ట్రైలర్ వంటి అప్‌డేట్స్‌తో సినిమాపై హైప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. 'జైలర్ 2'లో రజినీకాంత్‌తో పాటు భారీ తారాగణం భాగమవుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, విలక్షణ నటుడు ఎస్.జే. సూర్య, బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా ఇతర ఇండస్ట్రీలకు చెందిన ప్రముఖ స్టార్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో 'జైలర్ 2'పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి మరింత పెరిగింది.

--------

# పరికిణీలో ఆకట్టుకుంటున్న కయాదూ లోహర్!

ఇటీవల కాలంలో హీరోయిన్లు ఒకవైపు గ్లామర్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ.. సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను పెంచుకుంటూనే.. మరొకవైపు తమ సినిమా ప్రమోషన్స్ కూడా ఇదే ఇంస్టాగ్రామ్ ద్వారా చేస్తున్న విషయం తెలిసిందే. ఒకవైపు ఇంటర్వ్యూలో పాల్గొంటూ.. మరొకవైపు ఇలా గ్లామర్ తో కూడా ప్రమోషన్స్ చేస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నారు.. అలాంటి వారిలో కయాదు లోహర్ కూడా ఒకరు. 4 అందులో భాగంగానే ఇంస్టాగ్రామ్ వేదికగా గత కొన్ని రోజులుగా వరుస గ్లామర్ ఫోటోలు షేర్ చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె.. నేడు సాంప్రదాయంగా లంగా వోణీలో కనిపించి అభిమానులను ఆకట్టుకుంది. గోల్డెన్ కలర్ తో డిజైన్ చేసిన ఈ లంగా వోణీలో అమ్మడి అందం రెట్టింపు అవుతోందని చెప్పవచ్చు. జడ దువ్వుకొని కింద రిబ్బన్ కట్టుకొని చాలా అందంగా కనిపించింది కయాదు లోహర్. పాలమీగడ లాంటి మేని ఛాయతో మైమరిపింప చేసింది. ముఖ్యంగా ఒకవైపు ఈమె నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇలా అందంగా తయారయింది అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం ది ప్యారడైజ్. ఇదివరకే వీరి కాంబినేషన్లో దసరా సినిమా వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇక అందుకే మళ్ళీ వీరిద్దరి కాంబినేషన్లో సినిమా ప్రకటించడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. దీనికి తోడు వీరిద్దరి కాంబినేషన్లో వస్తున్న ది ప్యారడైజ్ మూవీ నుండి విడుదల చేసిన ప్రతి అప్డేట్ కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారుతుంది. పైగా సినిమా నుండి విడుదల చేసిన పాటలు కూడా యూట్యూబ్లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. అలాంటి చిత్రంలో కయాదు లోహర్ హీరోయిన్గా అవకాశం అందుకుంది.







# కుటుంబానికి ఇచ్చే ప్రేమే ప్రజలకు పంచుతున్నాడు..

## నిండు నూరేళ్లు వర్ధిల్లు పవన్: చిరంజీవి



జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ఓ సుదీర్ఘమైన, భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. తన తమ్ముడు కుటుంబం పట్ల చూపించే ప్రేమాభిమానాలనే, తనను నమ్మిన ప్రజల పట్ల కూడా చూపిస్తాడని చిరంజీవి కొనియాడారు. ప్రేమ, విశ్వసనీయత, సంకల్పం, బాధ్యత వంటి గుణాలున్న వ్యక్తి పవన్ అని ప్రశంసించారు.
ప్రజలకు మేలు చేయాలనే తపన పవన్‌లో ప్రతిక్షణం కనిపిస్తుందని, ఈ లక్షణాలను తాను చిన్నప్పటి నుంచి గమనిస్తున్నానని చిరంజీవి పేర్కొన్నారు. ఏ పని చేపట్టినా అందులో పూర్తిగా నిమగ్నమై, ఎంతో మందికి మేలు చేయాలనే తపనతో ప్రతి అడుగు వేస్తాడని వివరించారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పవన్ పనితీరుపై చిరంజీవి ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు.
గ్రామాల అభివృద్ధి, గిరిజన ప్రాంతాల అభ్యున్నతి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అంకితభావంతో పనిచేస్తున్నాడని తెలిపారు. ప్రజల కనీస అవసరాలను తీరుస్తూ పాలనలో పవన్ తనదైన ప్రత్యేక ముద్ర వేస్తున్న తీరును చూసి గర్వపడుతున్నానని అన్నారు.ఏళ్ల తరబడి పరిష్కారం కాని ఎన్నో సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, మారుమూల ప్రాంతాలకు సైతం అభివృద్ధిని తీసుకెళ్తున్న విధానం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని చిరంజీవి తన సందేశంలో పేర్కొన్నారు. తనను ఎన్నుకున్న పిఠాపురం ప్రజలకు కేవలం ఒక ప్రజాప్రతినిధిగానే కాకుండా, ఒక కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తున్నాడని అన్నారు. "ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తాడు కల్యాణ్ బాబు" అని చిరంజీవి ఆప్యాయంగా పేర్కొన్నారు.భవిష్యత్తులో తెలుగు ప్రజలందరూ మెచ్చుకునే నాయకుడిగా తన లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. తన తమ్ముడు సంపూర్ణ ఆయురారోగ్యాలతో వందేళ్లు జీవించాలని, మరింత శక్తితో ప్రజాసేవకు పునరంకితం కావాలని తమ ఇలవేల్పు అయిన ఆంజనేయస్వామిని ప్రార్థిస్తున్నట్లు చిరంజీవి తన సందేశాన్ని ముగించారు. అన్నయ్యగా చిరంజీవి చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.